కీసరగుట్టలో కార్తిక పూజలు

కీసర, నవంబర్ 20: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. శివభక్తులు స్వామివారికి గర్భాలయంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ, ఈఓ కట్టా సుధాకర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్: ఉప్పల్‌లోని శివశంకర మహామ్మాయి ఆలయంలో కార్తీక మాస వనభోజనాలు సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానంచేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు బలవంత చారి, రాజ గోపాలచారి, శ్రీనివాస్, శ్రీధర్, రాజ మల్లేష్, కృష్ణ, శ్రీనివాస్‌శర్మ, లక్ష్మణ్, రాజు, సతీష్‌కుమార్, నాగరాజు, దశరథ, కృష్ణారెడ్డి, జగన్నాథ్, అనిల్‌రెడ్డి, రాంప్రకాశ్, రాజు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్‌గ్యాన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం

కుత్బుల్లాపూర్,నవంబర్ 20 : యంగ్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఇండియా బిగ్గెస్ట్ సూపర్ స్టార్ స్కేటర్స్-24 పోటీల్లో కుత్బుల్లాపూర్ వెంకటేశ్వర నగర్ సత్ జ్ఞాన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 16 మంది విద్యార్థులు స్కేటింగ్ పోటీల్లో పాల్గొనగా 14 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చారు. బుధవారం విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం అభినందించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 20 : కేపీహెచ్‌బీ కాలనీలో బ్రాహ్మణ సంఘ భవనం, దోబీఘాట్ ప్రహరీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ, ఈఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాలను నిర్మించి కుల సంఘాలకు తోడ్పాటునందిస్తున్నామని అన్నారు. కాలనీలో రజకుల ధోబీఘాట్ చుట్టూ, బ్రాహ్మణులకు పంచకర్మల కోసం నిర్మించిన భవనం ప్రహరీలను నిర్మించి అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, డీఈ శ్రీదేవి, ఏఈ సాయిప్రసాద్, ఏఎంహెచ్‌వో కార్తిక్, జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నరేంద్రాచార్య, స్థానిక నాయకులు సాయిబాబాచౌదరి, రాజేశ్ రాయ్, వెంకట్‌రెడ్డి, రజక సంఘం, బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివాలయ స్థల సమస్యను పరిష్కరించండి : ఎమ్మెల్యే

కైత్లాపూర్ గ్రామంలో శివాలయానికి చెందిన స్థల సమస్యను పరిష్కరించిన తర్వాతనే.. హౌసింగ్‌బోర్డు స్థలాలకు కంచే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులకు సూచించారు. కైత్లాపూర్ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు బుధవారం గ్రామంలోని శివాలయం, హౌసింగ్ బోర్డు స్థలాలను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు.. హౌసింగ్ బోర్డు స్థలాలకు కంచే ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు అందోళన చెందుతున్నారన్నారు. గ్రామంలో పురాతన శివాలయంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాలను వదలాలని గ్రామస్తులు కోరుతున్నతున్నారని హౌసింగ్‌బోర్డు అధికారులు వారి మొరను ఆలకించాలన్నారు. ఆలయానికి చెందిన స్థలం సమస్య పరిష్కారం అయ్యేవరకు.. కంచే వేసే పనులను ఆపాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, గ్రామస్తులు సంతోష్, యాదయ్యగౌడ్, జ్ఞానేశ్వర్, నవీన్, నగేశ్, ఎల్లేశ్, మంజు, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను తర్వగా పూర్తిచేయాలి : ఎమ్మెల్యే మాధవరం

అల్లాపూర్ : అభివృద్ధి పనుల్లో జాప్యం చేయకుండా త్వరగా పూర్తిచేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో జరుగుతున్న బస్తీ దవాఖాన, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సబీహా బేగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీనగర్, సఫ్దార్‌నగర్‌లలో పేదలు అధికంగా నివసిస్తున్నారని దవాఖాన నిర్మాణంలో జాప్యం జరగడం వలన వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తిచేసి దవాఖానను అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, అయిలయ్య, వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, సలావుద్దీన్, మొయిన్, వాజీద్, రఫిక్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, డీసీ వంశీకృష్ణ, ఈఈ శ్రీనివాస్ తదితరులు

రాజీవ్‌గాంధీనగర్‌లో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబీహాబేగం

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్,నవంబర్ 20: కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని సీతారామచంద్రస్వామి, విశాలక్షి విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం జరిగిన రాజగోపుర శిఖర కలశ స్థాపన పూజల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ సమితి ప్రతినిధులు, భక్తులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో లాభాలు గడించాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 20: యువత స్వయం ఉపాధిని ఎంచుకుని లాభాలు గడించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో బుధవారం జరిగిన మొబైల్ షాప్ అసోసియేషన్ వార్షికోత్సవ సమావేశంలో చైర్‌పర్సన్ పావనీ, ఇన్‌స్పెక్టర్ పరశురామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది నకిలీ ఫోన్లు విక్రయిస్తు సామాన్యులను మోసం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం మాట్లాడుతూ.. మొబైల్ షాపుల యజమానులు దొంగిలించిన ఫోన్లు అమ్మేందుకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఫోసమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ అంజనేయులు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

మేడ్చల్, నవంబరు 20: ర్యాగింగ్ విష సంస్కృతికి దూరంగా ఉండాలని సీఐ సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్ చేయడం వల్ల ఎన్నో అనర్థాలను జరుగుతున్నాయన్నారు. కొంత మంది చదువుకు దూరమైతే, మరికొంత మంది తనువు చాలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి,డీన్ వెంకటరమణయ్య, సీఈవో అభినవ్ రెడ్డి, డైరెక్టర్ ఆలీబేగ్, పీఆర్‌వో దుర్గా ప్రసాద్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

గీతామందిర్ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 20: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం అన్నారు. ఘట్‌కేసర్ పట్టణం బాలాజీనగర్‌లోని గీతామందిర్ ఆలయంలో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రభాకర్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ..

ఉప్పల్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగం చెరువు తండాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బుధవారం నాచారం పోలీసులు ఆయా సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై మైబెల్లి, సిబ్బంది, కాలనీ అధ్యక్షుడు పీరు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి తదితరులు

బాలానగర్, నవంబర్ 20 : ప్రజలంతా పశుగణన కార్యక్రమంలో పాల్గొని వివరాలు అందించాలని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ మద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లిలో మండల పశువైద్యశాల వైద్యులు సంధ్యారాణితో కలిసి పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గురువారం నుంచి 29 ఫిబ్రవరి, 2025 వరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పశువైద్యశాల వైద్యులు సంధ్యారాణి మాట్లాడుతూ.. బోయిన్‌పల్లి పశు వైద్యశాల పరిధిలో తిరుమలగిరి, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ మండలాల్లో 22 మంది ఎన్యూమరేటర్లు, నలుగురు సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ వద్ద ఉన్న ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కుక్కలు తదితర పశువుల వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పశుగణన అధికారి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ పోలీస్ సిబ్బందికి రివార్డు

పోలీస్ సిబ్బందికి రివార్డు అందజేస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీ హనుమంతరావు, సీఐ నర్సింహరాజు

బాలానగర్, నవంబర్ 20 : కనిపించకుండా తిరుగుతున్న పాత ఆస్తి నేరస్తులను గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన బాలానగర్ పీఎస్ సిబ్బందిని డీసీపీ సురేశ్‌కుమార్ అభినందించి రివార్డు అందజేశారు. బుధవారం బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ నర్సింహరాజు, డీఐ నాగిరెడ్డితో కలిసి హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్‌కుమార్, కానిస్టేబుల్ కృష్ణయ్య, హోంగార్డ్ యాదప్పకు రివార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. బాలానగర్ పీఎస్ పరిధిలో ఆస్తి నేరస్తులుగా కేడీ షీట్ ఉన్న ఇద్దరు పాత నేరస్తులు కనిపించకుండా తిరుగుతున్నారు. వారిని గుర్తించి పట్టుకున్న సిబ్బందికి ప్రోత్సాహకంగా రివార్డును అందజేసినట్లు పేర్కొన్నారు. నేరస్తులను గుర్తించడంలో పోలీసుల కృషి గొప్పదన్నారు.

ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

మాదాపూర్, నవంబర్ 20: ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరుకు చెందిన వంగ శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు నవీన్ రెడ్డి(24) మాదాపూర్‌లోని మైండ్ స్పేస్‌లో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తూ స్నేహితులతో కలిసి హస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి 8:30 గంటల సమయంలో మాదాపూర్‌లో తాను పనిచేస్తున్న కంపెనీ 13వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉద్యోగులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నవీన్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మియాపూర్, నవంబర్ 20 : నిబంధనలను ఖాతరు చేయకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలు చేపడుతున్న యజమానులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా వంద గజాల్లో సెల్లార్‌లు తవ్వి ఆరు ఏడు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని, వాటి వల్ల సమీప నివాసితులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అక్రమ నిర్మాణాలపై తగిన పర్యవేక్షణ చూపడం లేదని, ఫలితంగా విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నాయని మల్లారెడ్డి పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 20 : అనారోగ్యంతో దవాఖానల్లో చేరిన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ అన్నారు. బుధవారం నియోజకవర్గానికి చెందిన మేడ చందర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 60వేల చెక్కును లబ్ధిదారుడికి అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, కిట్టు, శివచౌదరి, అరుణ్, అస్లాం, ఆది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో స్పోర్ట్స్ ఫెస్ట్ ప్రారంభం

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

దుండిగల్, నవంబర్ 20 : వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 16వ అఖిల భారత ఓపెన్ ఇంటర్ ఇంజినీరింగ్ కాలేజీ యేట్ స్పోర్ట్స్ ఫెస్ట్ బుధవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడోత్సవాల్లో వీఎన్ఆర్‌వీజేఐఈటీ కళాశాలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని 79 కళాశాలలకు చెందిన 1,700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. బాస్కెట్‌బాల్, చెస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలు జరుగనున్నాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జీ.శ్రీరామ్ తెలిపారు.

క్రీడాపోటీల ప్రారంభం అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ.. జయాపజయాలకు అతీతంగా క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీల్లో రాణించాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటడం ముఖ్యమన్నారు. కళాశాల సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పోటీలను వీక్షించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

సీఆర్‌పీఎఫ్ పోలీసులు దృఢంగా ఉండాలి

జవహర్‌నగర్, నవంబర్ 20: సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్ పోలీసులు శారీరక దృఢత్వంతో ఉండాలని సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనిల్‌మింజ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో వార్షిక క్రీడా కార్యక్రమంలో భాగంగా ఇంటర్ సెక్టార్ క్రాస్ కంట్రీ రేస్-2024 పోటీలు ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐజీపీ అనిల్‌మింజ్ హాజరై మాట్లాడారు.దేశంలోని సీఆర్‌పీఎఫ్ 23సెక్టార్ జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రేసులో మొదటి స్థానంలో మధ్యప్రదేశ్ సెక్టర్ మోహన్‌సింగ్ 130 బెటాలియన్(సెంట్రల్ సెక్టార్), ద్వితీయస్థానంలో హరేకృష్ణ (శ్రీనగర్ సెక్టార్), మూడో స్థానం దినేశ్ 218 బెటాలియన్(శ్రీనగర్ సెక్టార్)కు సంబంధించిన పోలీసులు బహుమతులు అందుకున్నారు. అనంతరం రేసులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. క్రీడల్లో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు సహకరించండి..

నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాచుపల్లి ఎంఈవో ఎంవీవీ రామకృష్ణ, తదితరులు

దుండిగల్,నవంబర్ 20 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వసతుల కల్పనకు సహకరించాలని బాచుపల్లి ఎంఈవో ఎంవీవీ రామకృష్ణ మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డిని కోరారు. ఈమేరకు బుధవారం హిల్‌కౌంటీలోని నివాసంలో మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యకలాపాల్లో భాగంగా పరిశ్రమల నుంచి నిధులు సేకరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇందుకు మేయర్ నీలాగోపాల్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రగతినగర్ పాఠశాల హెచ్ఎం చెన్నయ్య, సీనియర్ ఉపాధ్యాయులు నర్సింహులు, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

మియాపూర్, నవంబర్ 20 : కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని బల్లియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో ముందుకు నడుస్తానన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్ఎంఆర్ హైల్యాండ్ అపార్టుమెంట్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్ శ్రీకాంత్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంఘం ప్రతినిధులను కార్పొరేటర్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాల్లో నివాసితులను భాగస్వాములను చేయాలన్నారు. కాలనీవాసులకు అండగా ఉండాలని సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

శేరిలింగంపల్లి, నవంబర్ 20: ఈజీ మనీకి అలవాటు పడిన ఇద్దరు యువకులు గంజాయి తరలిస్తూ బుధవారం రాయదుర్గం పోలీసులకు పట్టుబడ్డారు. ఇన్స్‌పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తీపర్రు గ్రామానికి చెందిన లీల నాగపవన్(23) తణుకుకు చెందిన రవికృష్ణ ఇద్దరూ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వచ్చి ఎల్లమ్మబండలో ఉంటున్నారు. ఈ క్రమంలో నాగపవన్‌కు కాకినాడకు చెందిన సురేంద్రబాబు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. డబ్బులు అవసరం ఉన్నాయని యువకులు పేర్కొనడంతో గంజాయి సరఫరా చేస్తాను.. విక్రయిస్తే అధిక లాభాలు గడించవచ్చని వారికి చెప్పాడు. దీంతో ఇద్దరు యువకులు సరేనని చెప్పారు. కొద్ది రోజుల క్రితం సురేంద్రబాబు వద్ద కిలో గంజాయి తీసుకొని కాకినాడ నుంచి నాగపవన్, రవి కృష్ణ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వచ్చారు. గంజాయి విక్రయించడంతో డబ్బులు బాగా వస్తున్నాయని రెండో సారి ఏకంగా 5.5 కిలోల గంజాయిని బైక్‌పై తెచ్చారు. బుధవారం గచ్చిబౌలిలోని ఆల్ సబా హోటల్ వెనుక రోడ్డు నుంచి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు బైక్‌ను ఆపి తనిఖీ చేశారు. బ్యాగును తెరిచి చూడగా అందులో 5.5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయితోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఫార్మా ఉత్పత్తుల్లో భారత్‌దే.. అగ్రస్థానం

కేజీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కె.గోవిందరెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 20: ఫార్మా ఉత్పత్తుల్లో భారతదేశం అగ్ర స్థానంలో ఉన్నదని సీరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.రాంపల్లి కేజీఆర్ కళాశాలలో బుధవారం ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ కె.గోవిందరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిశోధన రంగాల్లో అపరిమిత ఉద్యోగ అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్, ఎస్ఐ హరిప్రసాద్, అధ్యాపకులు శిల్పిక, నాగరాజు. సింధూజ, రాధిక, సుసాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 20 : వసంతనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో లైన్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు... ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2, సీబీసీఐడీ కాలనీ, ఎస్ఎస్‌కాలనీ, హైదర్‌నగర్ మెయిన్ రోడ్డు, డైమాండ్‌హిల్స్ పరిసర ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. వసంతనగర్ కాలనీ, సర్దార్ పటేల్‌నగర్, సాయినగర్, మెడోల్యాండ్స్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2 , గోకుల్‌ప్లాట్స్, కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్, జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూకట్‌పల్లిలో..

కూకట్‌పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్య తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సుమిత్రానగర్, వివేకానందనగర్, ఆర్‌కే స్ట్రీట్, వినాయక పార్కు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

బాలానగర్ పరిధిలో..

బాలానగర్ : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్(సీబీడీ) ఏడీఈ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారాంపురం ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు సీతారాంపురం, గణేశ్‌కాలనీ, మర్రి రాంరెడ్డి కాలనీ, యాదవబస్తీ, కళ్యాణీ థియేటర్, బృందావన్ కాలనీ, సిండికేట్ బ్యాంక్‌కాలనీ, ఐస్ ఫ్యాక్టరీ ప్రాంతాల్లో, అలీ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రియదర్శిని, అ